క్లుప్తంగా

కష్టంతో కాదు ఇష్టంతో చదవాలి



మాట్లాడుతున్న వైవీయూ పాలకమండలి సభ్యులు మూల మల్లికార్జునరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినప్పుడే సులభంగా రాణించవచ్చని వైవీయూ పాలకమండలి సభ్యులు మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. కడప మోచంపేట సిద్దార్థ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పది విద్యార్థులకు వీడ్కోలు సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు అన్నారు. కష్టపడి చదివి అటు పాఠశాలలతోపాటు వారి తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటా-పాట అదుర్స్



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా చిన్నారులు తమ నృత్యాలతో అలరించారు. స్థానిక విజిల్స్ డ్యాన్స్ అకాడమీఆధ్వర్యంలో కడప శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో సినిమా పాటలు, జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. సందర్శకులు అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కేజీబీవీలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రాజెక్టు పరిధిలో ఉన్న కేజీబీవీ పాఠశాలలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకరావాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి నూతనంగా 90 కేజీబీవీ పాఠశాలలు మంజూరయ్యాయని, ఇటి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకోచ్చి కేజీబీవీ సిబ్బందిపా ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. కేజీబీవీ వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుంచి వేలాది ఉపాధ్యాయులు ఇందులో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇతర శాఖల ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు లభించడం లేదన్నారు. మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు సర్వీసు నిబంధనలను అమలు చేసి వెంటనే ప్రభుత్వ పరిధిలోకి తీసురేరావాలని ఆయన డిమాండ్ చేశారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ



పర్యావరణ ర్యాలీలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

వైవీయూ : పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లెలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఆదివారం పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్-4 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.సునీత మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగంద్వారా జరిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవరుచుకోవాలి



ఇంటి గృహిణి నుంచి వివరాలను సేకరిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

కడప ఎడ్యుకేషన్ : ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు చదువుతోపాటు సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్లు షకీలాబేగం, గోవిందరెడ్డిలు పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా కడప ప్రభుత్వ జూనియర్ కళాశాల చెందిన విద్యార్థులు ఆదివారం కడప ఎన్‌జీవీకాలనీలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ కాలనీలో ఏఏ ఇళ్లలో ఎవరెవరు ఉన్నారు? వారు ఏఏ పనులను నిర్వహిస్తారు? అనే వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా సుబ్బారెడ్డి

అట్లూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా బండి వెంకట సుబ్బారెడ్డిని అధిష్టానం నియమించింది. అట్లూరు మండలం కొత్తకోటపాడుకు చెందిన వెంకట సుబ్బారెడ్డికి పార్టీలో సముచిత స్థానం కల్పించాలని అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

ఆరోగ్యం చల్ల‘కుండ’

- కుండలోని నీటితో అనేక ప్రయోజనాలు
- వేసవిలో పేదల ఫ్రిజ్‌కు డిమాండ్
- ఇతర రాష్ట్రాల కుండలకు భలే గిరాకీ



ఆకట్టుకునే డిజైన్‌తో మట్టి కుండలు



విక్రయానికి సిద్ధంగా మట్టి కుండలు



మట్టితో తయారు చేసిన వివిధ రకాల పరికరాలు

ఒకప్పుడు మన జీవితాల్లో మట్టి పాత్రలు, కుండలు మమేకమై ఉండేవి. మారిన జీవన శైలికి అనుగుణంగా స్టీలు, ప్లాస్టిక్, గాజు పాత్రలు రావడంతో కుండల వాడకం పూర్తిగా తగ్గిపోయింది. తాజాగా మట్టికుండల్లో నీరు తాగడం, మట్టి పాత్రలో చేసే వంటకాలు రుచి చూడడానికి ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్య ప్రయోజనాలు ఉండడమే ఇందుకు కారణం.

కడప కోటిరెడ్డి సర్కిల్ : వేసవి కాలం రావడంతో పేదవాడి ఫ్రిజ్ అయిన కుండకు మంచి డిమాండ్ నెలకొంది. మట్టి కుండల్లోని నీరు తాగడం, మట్టిపాత్రలో చేసిన ఆహారం భుజించడం వల్ల అనేక ప్రయోజనాలు ఒనగూరుతాయని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలి కాలంలో ధనవంతులు కూడా మట్టి కుండలోని నీరు తాగడానికి ప్రాధాన్యత ఇస్తుండడం విశేషం. అయితే మారుతున్న కాలానికి, అభిరుచులకు అనుగుణంగా రంగురంగుల కుండలు, పాత్రలు, గ్లాసులు, జగ్గులు, వాటర్ క్యాన్లు, టీ గ్లాసులు ప్రస్తుతం మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం కడప నగరంలోని పలు ప్రాంతాల్లో మట్టి కుండలను విక్రయిస్తున్నారు. తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, జడ్చర్ల, అనంతపురం, మదనపల్లె, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో తయారు చేసిన మట్టి కుండలను విక్రయిస్తున్నారు. వీటిలో నీళ్ల బాటిళ్లు, టీ గ్లాసులు, కూజాలు, బిర్యానీకుండలు, హుండీలు సైజునుబట్టి దాదాపు రూ. 150–1000 వరకు ఉంటున్నాయి.

కుండ నీరు ప్రయోజనకరం

మట్టికుండలకు సహజ సిద్ధంగా తాగునీటిని చల్లబరిచే గుణముంటుంది. నీటిని నిల్వ చేసుకుంటే చల్లగా ఉండడంతోపాటు ఖనిజ లవణాలు నిల్వ ఉంటాయి. సూక్ష్మ రంధ్రాల ద్వారా వెచ్చదనం బయటికి వెళ్తుందని, ఆ నీటిని తాగితే శరీరంలో రక్త ప్రసరణ బాగా జరిగి ఆరోగ్యంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఫ్రిజ్ నీరు తాగడం వల్ల గొంతునొప్పి, శ్వాసకోశ వ్యాధులు వస్తాయని, అయితే మట్టికుండలో నీటిని తాగడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని, ఎలాంటి రోగాలు దరిచేరవని పలువురు వైద్యులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండడంతో బయటికి వెళ్లి ఇంటికి వచ్చినపుడు ఓ గ్లాసు మట్టికుండలోని నీరు తాగితే దాహార్తి తీరి ఎంతో ఊరట లభిస్తుంది. కడుపులో మంట, ఇతర జీర్ణకోశ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. మట్టికుండలోని నీరు తాగడం వల్ల అతిగా దాహం వేయదు. అలాగే వడదెబ్బ తగలకుండా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. మట్టి పాత్రల్లో చేసిన ఆహారం రుచిగా ఉంటుంది. ఆహార పదార్థాల్లో పోషకాలు వథాగా కావు. మట్టిపాత్రలో చేసిన ఆహారం ఎంతో ఆరోగ్యదాయకం.

రోజుకు 50 కుండల వరకు విక్రయం



మేము మట్టికుండలు విక్రయించేవారం. ఈ కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నాం. వేసవిలో మట్టికుండలతోపాటు టీ గ్లాసులు, వాటర్ బాటిళ్లు సైజును బట్టి అమ్ముతున్నాం. రోజుకు దాదాపుగా 30-50 వరకు కుండలను విక్రయిస్తాం. తమ వద్ద ఇతర రాష్ట్రాలకు చెందిన కుండలు ఉండడంతో కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

– లక్ష్మిదేవి, కుండల వ్యాపారి, కడప

మట్టికుండల్లోని నీరు శ్రేష్టం



వేసవిలోనే కాకుండా సాధారణ రోజుల్లో మట్టికుండల్లోని నీరు తాగడం ఎంతో శ్రేయస్కరం. ఎండలో బయటికి వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత ఒక గ్లాసు మట్టికుండ నీరు తాగితే దాహార్తి తీరి ఎంతో హాయిగా ఉంటుంది. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్‌లో ఎన్నో రకరకాల మట్టికుండలో అందుబాటులో ఉన్నాయి.

– శాంతమ్మ, కడప

ఫ్రిజ్ నీటితో ఆరోగ్య సమస్యలు



వేసవిలో పిల్లల నుంచి పెద్దల వరకు ఫ్రిజ్ నీటిని అధికంగా తాగుతుంటారు. చల్లని నీరు తాగడం వల్ల గొంతునొప్పితోపాటు శ్వాస కోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు దగ్గు, జలుబు, ఇతర సమస్యలు తలెత్తే ప్రమాదముంది. ఎండలో తిరిగి వచ్చిన తర్వాత ఫ్రిజ్ వద్దకు వెళ్లకుండా మట్టికుండలోని నీరు తాగడం శ్రేయేస్కరం.

– డాక్టర్ ప్రతాప్ భంగి, రిమ్స్ వైద్యులు, కడప

విద్యార్థులు కష్టపడి చదవాలి



పెన్నులు, ప్యాడ్స్ అందుకున్న విద్యార్థులతో అతిథులు

కడప కల్చరల్ : విద్యార్థులు కష్టపడి చదివి భావి భారత విద్యార్థులకు ఆదర్శంగా నిలబడాలని బద్వేలు ఫాతిమా చర్చి రెవరెండ్ ఫాదర్ గొడుగునూరు విజయరావు, మాసాపేట పునీత యోహాన్ చర్చి రెవరెండ్ ఫాదర్ గుడిమే దేవ సహాయం, ఆరోగ్యమాత పుణ్య క్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండి.ప్రసాదరావులు పిలుపునిచ్చారు. కడప నగరంలోని శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం పెన్నులు, అట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్రలో గొప్ప వారిగా చెప్పుకొనే ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి ముందుకు వెళ్లారని, అలాంటి వారిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శాంతి సేవా సొసైటీ చిన్నపాటి స్వచ్ఛంద సేవా సంస్థ అయినప్పటికీ వారి సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. విద్యార్థులకు చదువు పట్ల భయాన్ని పోగొట్టేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో శాంతి సేవా సొసైటీ సభ్యులు మడగలం మనోహర్, ఎలిజబెత్, పావని తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా గుండె వైద్య పరీక్షలు

ప్రొద్దుటూరు క్రైం: స్థానిక లక్ష్మి కార్డియాక్, కంటి ఆస్పత్రిల్లో ఆదివారం ఉచితంగా గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి గుండె వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఈసీజీ, స్కానింగ్ చేశారు. అలాగే డాక్టర్ హరిత 32 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు.

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి



కువైట్‌లో జరిగిన కార్యక్రమంలో బీహెచ్.ఇలియాస్, ఎం.బాలిరెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్ : 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రవాసాంధ్రులు కృషి చేయాలని గల్ఫ్ కన్వీనర్ బీహెచ్.ఇలియాస్, కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి పిలుపునిచ్చారు. కువైట్‌లోని పర్వానియా నౌషాద్ హోటల్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నూతన కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నారన్నారు. సుమారు 600 హామీలిచ్చిన టీడీపీ ప్రభుత్వం ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. రాష్ట్రానికి పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని, వెంకటేశ్వరస్వామి సాక్షిగా హామీ ఇచ్చిన బీజేపీ మాట తప్పిందన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలో విద్యార్థులను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంలో, సుడాన్‌లో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జరిగిన అంతర్గత ఘర్షణ సమయంలో 63 మందిని రాష్ట్రానికి తీసుకురావడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి ఎనలేనిదన్నారు. కరోనా సమయంలో ప్రవాసాంధ్రులకు ఏపీ ప్రభుత్వం చేసిన చేసిన మేలు జీవితంలో ఎవరూ మర్చిపోలేరన్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు, నాగరాజు, ఎస్.మహేష్‌రెడ్డి, ఎంవీ.నరసారెడ్డి, గౌస్ బాషా, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఏ.లాజరస్, షేక్ షా హుస్సేన్, లక్ష్మీ ప్రసాద్, షేక్ రహమతుల్లా, బీఎస్ సింహా, ఏ.బాలక్రిష్ణారెడ్డి, అఫ్సర్ అలీ, ఇమ్రాన్, ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.

‘గేట్’లో మైదుకూరు విద్యార్థి సత్తా



రామధీరజ్

మైదుకూరు : ఇంజినీరింగ్ గేట్ ఎంట్రన్స్‌లో మైదుకూరుకు చెందిన గోశెట్టి రామ ధీరజ్ అనే విద్యార్థికి ఆల్ ఇండియా స్థాయిలో 31వ ర్యాంకు వచ్చింది. విద్యార్థి చెన్నైలో ఎలక్ట్రికల్ విభాగంలో ఇంజనీరింగ్ చదివాడు. రామధీరజ్ ఆల్ ఇండియా స్థాయిలో 31వ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు రామచంద్రరావు, తల్లి విజయభారతి హర్షం వ్యక్తం చేశారు.

ఎలక్ట్రోరల్ బాండ్లతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకులు కొర్ర సురేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్

కడప ఎడ్యుకేషన్ : ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో వందల కోట్ల రుపాయలు రాజకీయ పార్టీలు పొందడం, తదుపరి తాము అధికారంలోకి వచ్చినప్పుడు తమకు విరాళంగా ఇచ్చిన సంస్థలకు మేలు చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకులు సురేష్ బాబు పేర్కొన్నారు. అఖిల భారత అభ్యుదయ వేదిక కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎలక్టోరల్ బాండ్ల అంశంపై ఆదివారం చర్చా వేదిక జరిగింది. ఈ సమావేశంలో సురేష్‌బాబు ఆమాట్లాడుతూ ఆర్థిక బలంతో ఎన్నికలలో ప్రత్యర్థులను అనైతిక పద్ధతుల్లో ఓడించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచి నట్టేటని అన్నారు. అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షుడు బొంగాని విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి శంకరయ్యలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించే ఎలెక్ట్రోరల్ బాండ్ల విధానం సమర్థనీయం కాదన్నారు. ప్రస్తుతం సామాన్యులు ఎన్నికలలో గెలవడమనేది అసాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయడం అందరి బాధ్యత

చర్చా కార్యక్రమంలో వక్తలు



మాట్లాడుతున్న విశ్రాంత అధ్యాపకులు రాటాల గోపి

వైవీయూ : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేయడం బాధ్యతగా భావించాలని పలువురు వక్తలు సూచించారు. కడప నగరంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ‘నా ఓటు–నా హక్కు’ అంశంపై ఆదివారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని అవినీతి రహిత సమాజం కోసం కృషిచేయాలన్నారు. రాజనీతి శాస్త్ర విశ్రాంత అధ్యాపకులు రాటాల గోపి మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే డబ్బు తీసుకోకుండా ఓటు వేయడంతోపాటు అభివృద్ధి కాంక్షించే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం యోగ గురువులు సిద్దయ్య, డా. రంగనాథరెడ్డి, సైకాలజీ కౌన్సిల్ సునీత, తాజుద్దీన్, ఖాజీ ఖదీర్, మద్దిలేటి, రమేష్, నిత సుధాకర్, శివశంకర్, కృష్ణతేజ, రవితేజ, అర్షద్, గణేష్, రామాంజనేయులు, రామాంజనేయరెడ్డి తదితరులు ఓటు ప్రాధాన్యతపై మాట్లాడారు.

వారాల జాతరకు పోటెత్తిన భక్తజనం



చింతకొమ్మదిన్నెలో విశేష అలంకారంలో అమ్మవారు

చింతకొమ్మదిన్నె : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తపేట గంగమ్మతల్లి జాతరలో భాగంగా మొదటి వారం అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలతో పాటు, వివిధ రకాల పూలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ చైర్మన్ పీబీ విశ్వనాథరెడ్డి, కార్యనిర్వహణాధికారి పి.సురేష్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను నిర్వహించారు. అమ్మవారికి కోర్కెలు తీరిన భక్తులు ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సీఐ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాట నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. దాతలు భక్తుల కోసం మజ్జిగ ప్యాకెట్లు, చల్లటి నీళ్లు, పానకం వడపప్పులను పంచిపెట్టారు.

ఘనంగా నరసింహస్వామి తిరునాల..

స్థానిక ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని స్పిన్నింగ్ మిల్ వద్ద ఉన్న శ్రీ చిన్నపల్లి యోగి నరసింహ స్వామి ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం ఆలయ ధర్మకర్త మునిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ కందుల ఓబులరెడ్డి అలియాస్ నాని రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.70 వేలు, రెండవ బహుమతి రూ. 50వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20వేలు, ఐదవ బహుమతి రూ.15వేలు, ఆరవ బహుమతి రూ.10 వేలు గెలుపొందిన ఎడ్ల యజమానులకు అందించారు.

ఘనంగా గంగమ్మ తిరునాల

లింగాల : మండలంలోని పెద్ద కుడాల, చిన్న కూడాల గ్రామాలలో వెలసిన గంగమ్మ దేవత ఆలయాల్లో ఆదివారం గంగమ్మ తిరునాల ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్లు అమ్మవారికి పట్టు వస్త్రాలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరునాల కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పెదకూడాల గ్రామంలో సాయంత్రం గంగమ్మ దేవత ఉత్సవ విగ్రహానికి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి స్వగృహంలో నిర్వహించిన విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్ర రమేష్‌కుమార్‌రెడ్డి, బాబురెడ్డి, వైఎస్సార్ సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారథి చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీఎస్‌ఆర్‌ఐ చంద్రహాస రెడ్డి, పెదకూడాల సర్పంచ్ శ్రీదేవి పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చివెల్లి గ్రామ సమీపంలో ఉన్న అచ్చివెల్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించు కోవడానికి కడప, అనంతపురం, కర్నూల్ జిల్లాలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివృద్ధికి తోడుగా నిలవండి



వీరపునాయునిపల్లె : ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : త్వరలో జరగబోవు ఎన్నికల్లో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెలుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తోడుగా నిలవాలని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గోనుమాకులపల్లె గ్రామంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడకుండా ఉండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ సురేంద్రకుమార్ యాదవ్, ఎంపీటీసీ గంగాధర, మాజీ ఎంపీపీ గోవిందురెడ్డి, మాజీ సర్పంచు పుల్లారెడ్డి, మండల పరిశీలకుడు రాజుపాలెం జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు సతీష్‌రెడ్డి, సుధాకర్, శ్రీకాంత్, బాల మునెయ్య, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ ప్రదాతను ఆశీర్వదించండి



ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి

చెన్నూరు : కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని సీకే దిన్నె జడ్పీటీసీ పోచంరెడ్డి నరేన్ రామాంజులురెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ముండ్లపల్లె, రాచినాయపల్లె గ్రామపంచాయతీలో తన తండ్రి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఏదైతే ప్రజలకు హామీ ఇచ్చారో అవన్నీ కూడా నెరవేర్చడం జరిగిందన్నారు. అవ్వ తాతలు, అక్కా చెల్లెమ్మలు, అన్నదమ్ములు, అందరూ ఆలోచించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ మాసీమబాబు, సర్పంచ్‌లు అల్లాడు పాండు రంగారెడ్డి, సొంటం నారాయణరెడ్డి, తుంగచంద్రశేఖర్‌యాదవ్, రమణారెడ్డి, హరి, మాజీ సర్పంచ్ లావణ్య, శివారెడ్డి, బాబురెడ్డి, శివారెడ్డి, జిలానీ బాషా, జనార్దన్‌రెడ్డి, కిషోర్, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ కుసుమకుమారి మృతి బాధాకరం



కుసుమకుమారి (ఫైల్)

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఏపీఎస్సార్టీసీ కడప డిపో కండక్టర్ కుసుమకుమారి గుండెపోటుతో మృతి చెందడం అత్యంత బాధాకరమని ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ సెక్రటరి ఏఆర్.మూర్తి, కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు రాము, బాలవెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుసుమకుమారి తన 25 ఏళ్ల సర్వీసులో ఒక్క తప్పు కూడా చేయలేదని, తప్పు చేసిందని ఆమెపై ఇపుడు అభియోగం మోపారన్నారు. ఈ నెల 5న 87 మంది ప్రయాణికులతో వెళ్తున్న రాజంపేట–కడప లాస్ట్ సింగిల్ సర్వీసులో రూ. 20 తీసుకుని టిక్కెట్ ఇవ్వలేదని తనిఖీ అధికారులు కేసు నమోదు చేశారన్నారు. ఈ విషయంగా మానసికంగా కృంగిపోయిన కుసుమకుమారికి గుండెపోటు రావడంతో శనివారం మృతి చెందడం జరిగిందన్నారు. బాధితురాలి కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా చూడాలని వారు ఆర్టీసీ అధికారులను కోరారు.

ఎన్నికల సమయంలో అప్రమత్తంగా వుండాలి



కడప తాలూకా పరిధిలో పల్లెనిద్రలో స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

కడప అర్బన్ : ఎన్నికల సమయంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని కడప తాలూకా సీఐ తిమ్మయ్య తెలియజేశారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు సీఐ తిమ్మయ్య, తమ సిబ్బందితో కలిసి అలంఖాన్‌పల్లెలో ఆదివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతంలో ఏవైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.